సాక్షి విశాఖపట్నం

ఆదివారం । 10 । డిసెంబర్ । 2023



13 నుంచి మార్గశిర ఉత్సవాలు

కనకమహాలక్ష్మి మార్గశిర మాసోత్సవాలు ఈ నెల 13 నుంచి వైభవంగా నిర్వహించ నున్నట్టు ఈవో శిరీష తెలిపారు. 8లో



ఆక్రమణల తొలగింపు

మధురవాడలో సుమారు రూ.8 కోట్ల విలువ చేసే ప్రభుత్వ భూమి పరిరక్షణకు రెవెన్యూ అధికారులు చర్యలు చేపట్టారు. 8లో



వైభవంగా తిరుచ్చి ఉత్సవం

రుషికొండలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో అత్యంత వైభవంగా పవిత్రోత్సవాలు కొనసాగుతున్నాయి. 8లో

న్యూస్‌రీల్

అప్పన్నను దర్శించుకున్న హైకోర్టు న్యాయమూర్తి



జస్టిస్ శ్యామ్‌సుందర్‌కి అప్పన్న జ్ఞాపికను అందజేస్తున్న ఈవో శ్రీనివాసమూర్తి

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని శనివారం రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.శ్యామ్‌సుందర్ కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. ఆలయ ధ్వజస్తంభం వద్ద ఆయనకు దేవస్థానం ఈవో శ్రీనివాసమూర్తి, అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం న్యాయమూర్తి ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేశారు. ఆయన పేరిట అంతరాలయంలో అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామి ప్రసాదాన్ని, జ్ఞాపికను, శేషవస్త్రాన్ని ఈవో శ్రీనివాసమూర్తి అందజేశారు.

విలువలు వ్యక్తి జీవనాన్ని ప్రభావితం చేస్తాయి

ఏయూ క్యాంపస్: విలువలు వ్యక్తి జీవితాన్ని ఎంత గానో ప్రభావితం చేస్తాయని రతన్ టాటా వాల్యూస్ అండ్ అడ్మైరర్స్ సెంటర్ డైరెక్టర్ రామన్ అన్నారు. ఏయూ పూర్వ విద్యార్థుల సంఘ సమావేశంలో శనివారం ఆయన విద్యార్థులతో ముచ్చటించారు. యువత ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడంలో టాటా సంస్థలు ఉన్నత ప్రమాణాలను కలిగి ఉన్నాయన్నారు. రతన్ టాటా వలే యువత నైతిక విలువలకు ప్రాధాన్యమిస్తూ ఆదర్శవంతంగా నిలవాలని సూచించారు. రతన్ టాటా జీవితాన్ని, ఆయన అనుసరించిన విలువలను యువత తెలుసుకోవాలని పిలుపునిచ్చారు.

మా కొద్దీ యువగళం!

లోకేష్ యువగళం పాదయాత్రకు ఆ పార్టీ నేతలే ఆసక్తి చూపడం లేదు. తమ నియోజకవర్గాల్లో వద్దు బాబోయ్ అంటూ వేడుకుంటున్నారు. పాదయాత్రకు జనం నుంచి పెద్దగా స్పందన లేకపోవడాన్ని గ్రహించిన ఆ పార్టీ నేతలు.. జన సమీకరణకు వచ్చే ఇబ్బందులను గ్రహించి తమ వద్ద వద్దంటూ తెగేసి చెబుతున్నారు. ఇక తన కొడుకు సీటు విషయంలో కినుక వహించిన మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు 'మా కొద్దీ యువగళం' అని స్పష్టం చేసినట్టు ప్రచారం జరుగుతోంది. ఇక చోడవరం, మాడుగుల నియోజకవర్గాల్లో పాదయాత్ర నిర్వహణకు ఎవరూ ముందుకు రాలేదని తెలుస్తోంది.



- యువగళం పాదయాత్ర తమ నియోజకవర్గాల్లో వద్దంటున్న తమ్ముళ్లు
- నర్సీపట్నం, చోడవరం, మాడుగుల నియోజకవర్గంలో యాత్ర రద్దు
- పార్టీ వైఖరిపై అయ్యన్న కినుక, చేతులెత్తేసిన చోడవరం, మాడుగుల నేతలు
- చేసేదేమీ లేక రూట్‌మ్యాప్ మార్పు

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం:

టీడీపీ నేత లోకేష్ యువగళం పాదయాత్రపై ఆ పార్టీ నేతలే పెదవిరుస్తున్నారు. తమ నియోజకవర్గాల్లో పాదయాత్ర అవసరం లేదని, రూట్ మ్యాప్ మార్చాలంటూ వేడుకుంటున్నారు. మొదటగా ప్రకటించిన షెడ్యూల్‌లో ఉన్న తమ నియోజకవర్గాలను తప్పించి, కొత్త రూట్ మ్యాప్‌ను సిద్ధం చేసుకోవాలని తేల్చిచెబుతున్నారు. పాదయాత్రకు జన సమీకరణ తమ వల్ల కాదని కొందరు అంటుంటే.. పార్టీ అధిష్టానం వైఖరిపై వ్యతిరేకతతో కొందరు ఆసక్తి చూపడం లేదు. ప్రధానంగా మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు అలకబూనడంతో నర్సీపట్నం నియోజకవర్గంలో యువగళం పాదయాత్ర రూట్ మ్యాప్ మారినట్టు ఆ పార్టీలోనే చర్చ జరుగుతోంది. తన కుమారుడికి అనకాపల్లి ఎంపీ సీటుపై స్పష్టత ఇవ్వకపోవడంతో యువగళం పాదయాత్రకు ఆసక్తి చూపడం లేదనే వార్తలు గుప్పుమంటున్నాయి. మరోవైపు చోడవరం, మాడుగుల నియోజకవర్గాలకు చెందిన నేతలు 'మా కొద్దీ యువగళం' అని తెగేసి చెబుతున్నట్టు సమాచారం. ఫలితంగా ఈ మూడు నియోజకవర్గాల్లో యువగళం పాదయాత్ర రద్దు అయినట్టు తెలుస్తోంది. తెలుగు తమ్ముళ్ల నిరాసక్తతో ఉమ్మడి విశాఖ జిల్లాలో యువగళం పాదయాత్ర రూట్‌మ్యాప్‌ను మార్చివేసినట్టు ఆ పార్టీ నేతలే పేర్కొనడం గమనార్హం.

సొంత నేతల నుంచే నిరాసక్తత!

తొలుత షెడ్యూల్ ప్రకారం పాదయాత్ర ఉమ్మడి విశాఖ జిల్లాలో పాయకరావుపేట నుంచి కోటవురట్ల మీదుగా నర్సీపట్నం, చోడవరం, మాడుగుల, అనకాపల్లి, పరవాడ, గాజువాక మీదుగా నగరంలోకి ప్రవేశించి పెందుర్తి మీదుగా భీమిలికి చేరుకుంటుందని ప్రకటించారు. తాజా షెడ్యూల్ ప్రకారం ఈ నెల 11న పాయకరావుపేటలో ప్రవేశించి యలమంచిలి, అనకాపల్లి, పరవాడ, గాజువాక మీదుగా నగరంలోకి ప్రవేశించనుంది. ఈ నెల 20 లేదా 21వ తేదీన భీమిలిలో ముగించాలని నిర్ణయించారు. ఇందులో నర్సీపట్నం, చోడవరంతో పాటు మాడుగుల నియోజకవర్గాలను తీసివేశారు. ప్రధానంగా తన కొడుకు ఎంపీ టికెట్‌పై పదే పదే అడుగుతున్నా తేల్చకపోవడంతో పాటు ఎన్నికల ముందు బయటకు వచ్చిన గంటాకు ప్రాధాన్యత ఇవ్వడాన్ని అయ్యన్నపాత్రుడు తీవ్రంగా తప్పుపడుతున్నట్టు తెలుస్తోంది. అనకాపల్లి ఎంపీ టికెట్‌ను తన కొడుకుకు కేటాయించాలని కోరినా పట్టించుకోకపోగా.. ఈ సీటు కోసం గంటా కొంతమందితో మాటా మంతీ సాగించడంపై అయ్యన్న తీవ్రంగా తప్పుపడుతున్నట్టు తెలుస్తోంది. మరోవైపు చోడవరంలో పాదయాత్ర నిర్వహణకు ఆ పార్టీ ముఖ్యులు ముందుకు రాకపోగా.. మాడుగుల నియోజకవర్గంలో అసలు నేత ఎవరనే చిక్కు వచ్చింది. అంతేకాకుండా అధికార వైఎస్సార్ సీపీ నిర్వహించిన సామాజిక బస్సు యాత్రకు జనం జేజేలు పలకడంతో ముఠాలతో కుస్తీ పడుతున్న టీడీపీ నేతల వైఖరితో ఈ నియోజకవర్గంలో పాదయాత్ర నిర్వహణ కష్టమని పార్టీ పెద్దలు కూడా భావించినట్టు తెలుస్తోంది.

పార్టీ వైఖరిపై కినుక !

వాస్తవానికి అనకాపల్లి ఎంపీ సీటుతో పాటు నర్సీపట్నం ఎమ్మెల్యే టికెట్ కావాలని అయ్యన్నపాత్రుడు పట్టుబడుతున్నారు. అయితే దీనిపై పార్టీ నుంచి సరైన స్పందన లభించలేదు. నర్సీపట్నం టికెట్ ఇస్తాం.. ఎంపీ టికెట్‌పై చూద్దామంటూ దాటవేసినట్టు తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే అనకాపల్లి ఎంపీ టికెట్ కోసం మాజీ మంత్రి గంటా అభ్యర్థులను అన్వేషిస్తున్నారు. ఒక ఎన్ఆర్ఐను బరిలోకి నిలిపేందుకు వెదకడంతో పాటు కొద్ది మందిని పార్టీ అధినేత దృష్టికి తీసుకెళ్లినట్టు తెలుస్తోంది. ఈ వ్యవహారంలో అయ్యన్నపాత్రుడు మండిపడుతున్నారు. అంతేకాకుండా నర్సీపట్నం నియోజకవర్గంలో కూడా కొద్ది మంది అసంతృప్తి నేతలను కలిపి పిక్నిక్ తరహాలో వన భోజనాలను గతంలో గంటానే వెనుక ఉండి నిర్వహించేలా చేశారనేది అయ్యన్న అభియోగం. ఈ విషయాన్ని కూడా పార్టీ అధినేత వద్ద ప్రస్తావించినట్టు తెలుస్తోంది. అయినప్పటికీ గంటాను పిలిచి మందలించడం వంటిది చేయకపోవడం అయ్యన్నకు మరింత ఆగ్రహాన్ని తెప్పించిందనే ప్రచారం జరుగుతోంది. మరోవైపు ఎన్నికలకు ఏడాది ముందు మాత్రమే గంటా బయటకు రావడాన్ని అయ్యన్నపాత్రుడు బహిరంగంగానే విమర్శించారు. పార్టీ కష్టాల్లో ఉన్నప్పుడు పట్టించుకోని నేతలను దూరం ఉంచాలని.. వారితో జాగ్రత్తగా వ్యవహరించాలని కూడా అయ్యన్న నేరుగా చంద్రబాబుకే స్పష్టం చేశారు. అయినప్పటికీ వైఖరి మారకపోవడంతో అలకబూనినట్టు తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే నియోజకవర్గంలో యువగళం పాదయాత్ర నిర్వహణకు పెద్దగా ఆసక్తి చూపలేదని ప్రచారం జరుగుతోంది. మొత్తంగా ఉమ్మడి విశాఖ జిల్లాలో యువగళం పాదయాత్ర అంటేనే ఆ పార్టీ నేతలు తలలు పట్టుకుంటున్నారనే అభిప్రాయం రాజకీయవర్గాల్లో వ్యక్తమవుతోంది.

శాశ్వత న్యాయం లోక్ అదాలత్‌తో సాధ్యం

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్
- జాతీయ లోక్ అదాలత్‌కు విశేష స్పందన
- 2,243 కేసులతో రాష్ట్రంలో ముందంజ



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్

విశాఖ లీగల్: రాజీమార్గమే రాజ మార్గమని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్ అన్నారు. జిల్లా కోర్టు ఆవరణలోని న్యాయ సేవ సాధికార సంస్థ సమావేశ మందిరంలో జాతీయ న్యాయ సేవ ప్రాధికార సంస్థ ఆదేశాల మేరకు శనివారం నిర్వహించిన ప్రత్యేక లోక్ అదాలత్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోక్ అదాలత్ ద్వారా కేసులు రాజీ జరిగితే శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. ఇరువర్గాలు తమ న్యాయవాది ద్వారా కేసులను పరిష్కరించుకోవాలని కోరారు. కాగా.. అదాలత్‌కు విశేష స్పందన లభించింది. కేసుల పరిష్కారానికి 37 బెంచీలను ఏర్పాటు చేశారు. ప్రధాన న్యాయమూర్తి గిరిధర్ అన్ని న్యాయస్థానాల్లో కేసుల తీరు తెన్నులను పరిశీలించారు. జిల్లా లోక్ అదాలత్ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎం.వి.శేషమ్మ పర్యవేక్షించారు. సాయంత్రం 7 గంటల వరకు 2,243 కేసుల పరిష్కారంతో రాష్ట్రంలో జిల్లా ముందంజలో ఉంది. సమావేశంలో ప్రధాన మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి ఎస్.శ్రీదేవి, రెండవ అదనపు జిల్లా న్యాయమూర్తి ఎం.వెంకటరమణ, ఏసీబీ కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి మురళీకృష్ణ, నాలుగో అదనపు జిల్లా న్యాయమూర్తి శ్రీహరి, సీనియర్, జూనియర్ సివిల్ జడ్జి కోర్టుల న్యాయమూర్తులు, ఏపీపీలు, ప్రధాన మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్‌లు, పోలీస్ అధికారులు, న్యాయవాదులు, కక్షిదారులు, సమాంతర న్యాయ సేవా కార్యకర్తలు, న్యాయ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

సర్వేపల్లి, సి.వి.రామన్ నడయాడిన నేల ఇది





సావనీర్ ఆవిష్కరిస్తున్న నటరాజన్ చంద్రశేఖరన్, జీఎంఆర్, ఏయూ ఇన్‌చార్జ్ వీసీ సమత, రిజిస్ట్రార్ జేమ్స్ స్టీఫెన్, హాజరైన పూర్వ విద్యార్థులు

- ఏయూకు రావడం సంతోషంగా ఉంది
- సుందరమైన విశాఖలో ఒకరోజు గడిపాను
- టాటా సన్స్ చైర్మన్ చంద్రశేఖరన్

ఏయూక్యాంపస్: మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్, నోబెల్ పురస్కార గ్రహీత సి.వి.రామన్ నడయాడిన ఆంధ్ర విశ్వవిద్యాలయానికి రావడం తనకు అమితమైన సంతోషం కలిగించిందని టాటా సన్స్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ నటరాజన్ చంద్రశేఖరన్ అన్నారు. సుందరమైన విశాఖలో ఒక రోజు గడిపి మంచి అనుభూతిని పొందానని చెప్పారు. ఏయూ స్టార్టప్ ఇంక్యుబేషన్ హబ్ కేవలం రెండేళ్లలో అద్వితీయ ప్రగతిని సాధించడం గొప్ప విషయమని.. ఇది నెట్ వర్కింగ్‌తో మాత్రమే సాధ్యపడుతుందన్నారు. శనివారం జరిగిన ఏయూ పూర్వ విద్యార్థుల సంఘం వార్షిక సమ్మేళనానికి టాటా సన్స్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ నటరాజన్ చంద్రశేఖరన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా ప్రత్యేక హెలికాప్టర్‌లో ఏయూ అలుమ్ని అసోసియేషన్ వ్యవస్థాపక చైర్మన్, జీఎంఆర్ గ్రూప్ సంస్థల అధినేత జి.ఎం.రావుతో కలిసి ఆయన ఏయూ ఇంజినీరింగ్ కళాశాల మైదానంలోని హెలిప్యాడ్‌లో దిగారు. అక్కడ ఏయూ పూర్వ ఉపకులపతి ఆచార్య పి.వి.జి.డి ప్రసాదరెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ ఆయనకు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఏయూ పరిపాలన భవనానికి చేరుకోగా.. ఇన్‌చార్జి వీసీ ఆచార్య కె.సమత స్వాగతం పలికారు. ఎన్‌సీసీ విద్యార్థుల నుంచి గౌరవ వందనం స్వీకరించిన నటరాజన్.. వర్సిటీ వ్యవస్థాపక ఉపకులపతి కట్టమంచి రామలింగారెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఏయూ ఇంజినీరింగ్ కళాశాలలోని ఆ హబ్, నాస్కామ్ సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్, జియో ఇంజినీరింగ్ విభాగం ప్రయోగశాలలను సందర్శించారు. ఏయూ ఇంక్యుబేషన్, స్టార్టప్ కేంద్రాల్లో యువతను ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడానికి జరుగుతున్న కృషిని కేంద్రం సీఈవో రవి ఈశ్వరపు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఆయనకు వివరించారు. అక్కడి వసతులు, స్టార్టప్ సంస్థలు పని చేస్తున్న విధానం, ఉత్పత్తులు, సాంకేతికత తదితర అంశాలను ఆసక్తిగా అడిగి తెలుసుకున్నారు. తర్వాత ఏయూ పూర్వ విద్యార్థుల సంఘం కార్యాలయానికి చేరుకున్నారు. జీఎంఆర్ సెమినార్ హాల్, జీఎంఆర్ మల్టీపర్పస్ హాల్ సందర్శించి.. బోర్డ్ రూమ్‌లో పూర్వ విద్యార్థుల సంఘ కార్యవర్గ సభ్యులతో కొద్దిసేపు ముచ్చటించారు.

మహిళలకు ఉపాధి.. జీడీపీకి దోహదం

బీచ్‌రోడ్డులోని కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన కార్యక్రమంలో భాగంగా ఏయూ పూర్వవిద్యార్థుల సంఘం చైర్మన్ డాక్టర్ ఇ.శంకరరావు అడిగిన పలు ప్రశ్నలకు టాటాసన్స్ చైర్మన్ నటరాజన్ చంద్రశేఖరన్ సమాధానమిచ్చారు. మహిళలకు ఉపాధి పెరగడం.. దేశ జీడీపీకి దోహదపడుతుందన్నారు. కొందరు భారతీయ మహిళలు మాతృత్వం, కుటుంబ బాధ్యతల కోసం తమ ఆకాంక్షలు, ఉపాధిని వదులుకుంటున్నారనిలో ఓ ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. రైతులకు విద్య ఎంతో అవసరమని, సరైన పంట ఎంపిక చేసుకోవడం వలన ఉత్పాదకత పెరుగుతుందన్నారు. స్టార్టప్‌లను వ్యాపార సంస్థలుగా మార్చాలని సూచించారు. మరొక ప్రశ్నకు సమాధానమిస్తూ సైబర్ సెక్యూరిటీ రంగంలో నిపుణులను తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. ఒక్క శాతం నిర్లక్ష్యం వహించిన సైబర్ దాడులను గురికావాల్సి వస్తుందన్నారు. ప్రతీ దేశం ఓ సెంటర్ ఫర్ సైబర్ సెక్యూరిటీ కేంద్రాన్ని కలిగి ఉండాలని జీ–20 దేశాలకు సూచన చేశామన్నారు. 2045 నాటికి కార్బన్ జీరో చేసే దిశగా తమ సంస్థలు పని చేస్తున్న విధానాన్ని వివరించారు. కాగా.. ఏయూ సాధిస్తున్న ప్రగతిని ఇన్‌చార్జి వీసీ ఆచార్య కె.సమత ఆయనకు వివరించారు. కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ కె.కుమార్ రాజ, ఎ.మన్మోహన్, సంయుక్త కార్యదర్శి ఆకుల చంద్రశేఖర్ తదితరులు మాట్లాడారు. అనంతరం వర్చువల్ విధానంలో ఐపీఆర్ సెంటర్, టీడీఆర్ హబ్‌లతో పాటు పూర్వ విద్యార్థుల సంఘ వార్షిక సమ్మేళనం సావనీర్‌ను నటరాజన్ చంద్రశేఖరన్ ఆవిష్కరించారు. వర్సిటీ తరఫున ఆయన్ని ఘనంగా సత్కరించి జ్ఞాపిక బహూకరించారు.





ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

వరల్డ్ క్లాస్‌గా సింహాచలం రైల్వేస్టేషన్

- అమృత్ భారత్ స్టేషన్ స్కీమ్‌లో భాగంగా రూ.20కోట్లతో అభివృద్ధి
- సింహాచలం దేవస్థానం నమూనాతో నిర్మాణం
- రెండు వైపులా రూఫ్‌ప్లాజాలు
- సమీక్షించిన రైల్వేమంత్రి అశ్విని వైష్ణవ్



సింహాచలం రైల్వే స్టేషన్ ప్రాంగణంలో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్

గోపాలపట్నం: సింహాచలం రైల్వేస్టేషన్ రూపురేఖలు మారబోతున్నాయి. దేశంలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన సింహాచలం దేవస్థానం విశిష్టత తెలియజేసేలా స్టేషన్‌ను అభివృద్ధి చేస్తున్నట్లు కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడించారు. అమృత్ భారత్ స్టేషన్ స్కీమ్‌లో భాగంగా రూ.20 కోట్లతో అంతర్జాతీయ స్థాయి వసతులు కల్పించనున్నట్లు వివరించారు. సింహాచలం రైల్వేస్టేషన్‌ను శనివారం ఆయన సందర్శించి.. ఇక్కడి చేపట్టే అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్షించారు. స్టేషన్ అభివృద్ధి ప్రణాళికను వివరిస్తూ ఏర్పాటు చేసిన ఫొటో గ్యాలరీని తిలకించారు. స్టేషన్ మొత్తం కలియతిరిగారు. ఆయా ప్రాంతాల్లో చేపట్టే పనులకు అధికారులు ఆయనకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింహాచలం రైల్వే స్టేషన్ భక్తులకు అనుసంధానంగా ఉందన్నారు. స్టేషన్ ప్రవేశం వద్ద గాలిగోపురం మాదిరిగా నిర్మిస్తామన్నారు. ప్రయాణికుల సౌకర్యార్థం రూఫ్‌ప్లాజాలు ఏర్పాటు చేస్తామని, వరల్డ్ క్లాస్ స్టేషన్‌గా తీర్చిదిద్దుతామన్నారు. స్టేషన్‌లో స్టాల్ ఏర్పాటు చేసి స్థానిక ఉత్పత్తులకు ప్రాధాన్యమిస్తామన్నారు. ఇప్పుడున్న ఫుట్ ఓవర్ బ్రిడ్జి తొలగించి 12 మీటర్ల వెడల్పు గల కొత్త వంతెన నిర్మిస్తామన్నారు. ప్రస్తుతం ఇక్కడ రెండు ప్లాట్‌ఫాంలు ఉన్నాయని, మరో రెండు ప్లాట్‌ఫాంలు ఏర్పాటు చేస్తామన్నారు. ఈ స్టేషన్‌లో మరిన్ని రైళ్లు ఆగే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఉత్తరాంధ్రలో 15 రైల్వే స్టేషన్లను ప్రపంచ స్థాయి వసతులతో అభివృద్ధి చేస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఎంపీ జీవీఎల్ నరసింహారావు, ఎమ్మెల్యే గణబాబు, మాజీ ఎమ్మెల్సీ మాధవ్, రైల్వే జీఎం మనోజ్ శర్మ, డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్, బీజేపీ నాయకులు దాడి పురుషోత్తమ రమేష్, బాల రాజేశ్వరరావు, జీసీ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

రైల్వే స్టేషన్‌లో అభివృద్ధి ఇలా..

- స్టేషన్‌లో 12 మీటర్ల వెడల్పు గల ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణం
- విశాలంగా ప్రయాణికులు వేచి ఉండే గది, రిఫ్రెష్‌మెంట్ గదుల నిర్మాణం
- ఎగ్జిక్యూటివ్ లాంజ్ ఏర్పాటు
- సింహాచలం దేవస్థానానికి వెళ్లే భక్తుల కోసం క్లాక్ రూమ్
- స్టేషన్ ప్రాంతంలో సెక్యూరిటీ ఏర్పాటు
- కొత్తగా బుకింగ్, విచారణ కౌంటర్లు
- పార్కింగ్ ప్రాంతాన్ని విస్తరించడం
- అదనపు ప్లాట్‌ఫాంల నిర్మాణం
- అధునాతన టాయిలెట్లు, లైటింగ్ సౌకర్యం

నేడు జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు రాక

మహారాణిపేట: జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు సుభాష్ పార్థి మూడు రోజుల పర్యటన నిమిత్తం ఆదివారం విశాఖ వస్తున్నారు. ఇండిగో విమానంలో సాయంత్రం 7.50 గంటలకు విశాఖ విమానాశ్రయానికి చేరుకుంటారు. రాత్రికి విశాఖలో బస చేస్తారు. 11న గెయిల్ ఇండియా, ఎన్టీపీసీ, పవర్ గ్రిడ్‌లోని ఎస్సీ ఉద్యోగులు, ఎస్సీ అసోసియేషన్ల ప్రతినిధులు, ఈడీ, ఇతర సీనియర్ ఉద్యోగులతో ఆయా సంస్థల్లో సమావేశవుతారు. రాత్రికి విశాఖలో బస చేస్తారు. 12న స్టీల్‌ప్లాంట్, పోర్టు ట్రస్ట్, ఓఎన్జీసీలోని ఎస్సీ ఉద్యోగులు, అసోసియేషన్ల ప్రతినిధులు, స్టీల్‌ప్లాంట్ సీఎండీ, పోర్టు చైర్మన్, ఓఎన్జీసీ ఈడీ, ఇతర సీనియర్ అధికారులతో ఆయా సంస్థల్లో జరిగే సమావేశాల్లో పాల్గొంటారు. రాత్రి 8.25 నిమిషాలకు ఇండిగో విమానంలో ఢిల్లీ బయలుదేరుతారు. ఎస్సీ ఉద్యోగులు, అసోసియేషన్ల నుంచి ఆయన వినతులు, ఫిర్యాదులు స్వీకరిస్తారు.

మోదీ పాలనలో భారత్ అభివృద్ధి

ఆరిలోవ: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ హయాంలో ఈ తొమ్మిదేళ్లలో భారత్ ఎంతో అభివృద్ధి చెందిందని రైల్వే, కమ్యూనికేషన్స్, ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రి అశ్విని వైష్ణవ్ అన్నారు. జోడుగుళ్లపాలెంలో శనివారం వికసిత భారత్ సంకల్ప యాత్ర వాహనాన్ని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇక్కడ ప్రదర్శించిన ఆర్గానిక్ మందులు, పర్యావరణహితమైన పేపర్ ప్లేట్లు, చెక్కతో తయారు చేసిన స్పూన్లు, కాటన్ వస్త్రాలు, గోనె సంచులు, ఉజ్వల స్టాళ్లను ఆయన పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. ఈ తొమ్మిదేళ్లలో ప్రతి గ్రామంలో రోడ్లు, మరుగుదొడ్లు, విద్యుత్ సౌకర్యాలు కల్పించామన్నారు. కోవిడ్ సమయంలో దేశంలో 80 కోట్ల మందికి నెలకు ఐదు కిలోల చొప్పున ఉచితంగా బియ్యం పంపిణీ చేసినట్లు తెలిపారు. ఆయుష్మాన్ భారత్ ద్వారా రూ.5లక్షల వరకు ఆరోగ్య సంరక్షణ పథకం అమలు చేశామన్నారు. అర్హులై కేంద్ర పథకాలు అందని వారిని ఈ యాత్ర ద్వారా గుర్తించి.. లబ్ధి చేకూర్చుతామన్నారు. ఈ యాత్ర రోజుకు రెండు ప్రాంతాల్లో జరుగుతుందన్నారు. అనంతరం అధికారులతో కలసి 2024 మన సంకల్ప వికసిత భారత్ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. రాజ్యసభ సభ్యుడు జి.వి.ఎల్ నరసింహారావు, కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున, జీవీఎంసీ కమిషనర్ సి.ఎం సాయికాంత్ వర్మ, వాల్తేరు డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్ పాల్గొన్నారు.



వికసిత భారత్ సంకల్ప యాత్ర వాహనం ప్రారంభిస్తున్న కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్

జనవరి 25 నుంచి ఫిడే క్లాసికల్ చెస్ టోర్నీ

విశాఖ స్పోర్ట్స్: ఫిడే క్లాసికల్ చెస్ టోర్నమెంట్ జనవరి 25 నుంచి 28 వరకు నిర్వహించేందుకు ఆంధ్ర చెస్, ఆల్ విశాఖ చెస్ సంఘాలు సంయుక్తంగా ఏర్పాట్లు చేస్తున్నాయి. శ్రీ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ పోటీల్లో తొలి 25 స్థానాల్లో నిలిచిన వారికి రూ. 4 లక్షల బహుమతులు అందించనున్నారు. ఈ టోర్నీలో పాల్గొనేందుకు ఎంట్రీలను https://apchess.orgలో నమోదు చేసుకోవచ్చని నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా పోటీల పోస్టర్‌ను నిర్వాహక ప్రతినిధులు విడుదల చేశారు.

13 నుంచి కనకమహాలక్ష్మి మార్గశిర ఉత్సవాలు

దాబాగార్డెన్స్: విశాఖ వాసుల కల్పవల్లి కనకమహాలక్ష్మి మార్గశిర మాసోత్సవాలు ఈ నెల 13 నుంచి అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్టు ఆలయ కార్యనిర్వహణాధికారి కె.శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం తెలిపారు. ఈ మేరకు శనివారం ఉత్సవాలకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం విలేకరులతో వారు మాట్లాడుతూ 13న ఉదయం 8.01 గంటలకు ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ ఉత్సవాలు ప్రారంభించనున్నారని తెలిపారు. నెల రోజుల పాటు నిర్వహించే మహోత్సవాల్లో దాదాపు 6 లక్షల పైబడి భక్తులు అమ్మవారిని దర్శించుకునే అవకాశం ఉందన్నారు. భక్తుల కోసం తాగునీరు, వైద్య సదుపాయాలతో పాటు ఎటువంటి ఇబ్బందులు లేకుండా పోలీస్ శాఖ సమన్వయంతో భద్రతా ఏర్పాట్లు చేస్తున్నట్టు పేర్కొన్నారు. టౌన్‌కొత్తరోడ్డు జంక్షన్ నుంచి క్యూలైన్లు ఏర్పాటు చేశామన్నారు. నెల రోజుల పాటు జగన్నాథ స్వామి ఆలయంలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్టు చెప్పారు. వికలాంగులు, చంటి పిల్లల తల్లుల కోసం కొత్తరోడ్డు జంక్షన్ నుంచి ఆటో ఏర్పాటు చేశామన్నారు. ప్రతి రోజూ ఉదయం 7 నుంచి 9 గంటల వరకు ప్రముఖుల కోసం దర్శన సమయం కేటాయించినట్లు తెలిపారు. ఈ నెల 31న సాయంత్రం 6 గంటలకు వేదసభ, అర్చక సదస్సు, జనవరి 2న సాయంత్రం 4 గంటలకు నాదస్వర కచేరి, 6న మధ్యాహ్నం అంబికాబాగ్ రామాలయం నుంచి అమ్మవారి ఆలయం వరకు రథయాత్ర సాగనుందన్నారు. 11న జగన్నాథస్వామి ఆలయ ప్రాంగణం వద్ద మహాన్నదానం, సాయంత్రం 4 గంటల నుంచి 1008 కలశాలతో అమ్మవారికి సహస్ర ఘటాభిషేకం ఉంటుందన్నారు. సమావేశంలో ధర్మకర్తలు బోదిలపాటి సత్యరూపవాణి, మళ్ల ధనలత, మీసాల అశోక్‌కుమార్, బెహర వెంకటరత్నం, బుద్దల అనురాధ, సత్యవరపు సతీష్, వంకాయల మారుతీప్రసాద్, నందూరి సత్య శ్రీనివాస సుబ్రహ్మణ్యం, నొల్ల గురమ్మ, సానబోయిన సురేష్, ఎక్స్ అఫిషియో సభ్యుడు కె.శ్రీనివాసశర్మ, ప్రత్యేక ఆహ్వానితులు వెంకట రామకృష్ణారావు, గండెం ప్రకాష్, ఏఈవో కె.తిరుమలేశ్వరరావు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

కార్మికుడి మృతదేహం లభ్యం



భాను(ఫైల్)

ఉక్కునగరం: అదృశ్యమైన స్టీల్‌ప్లాంట్ టీపీపీ విభాగానికి చెందిన కాంట్రాక్ట్ కార్మికుడి మృతదేహం లభ్యమైంది. వివరాలివీ.. విభాగంలో పనిచేస్తున్న ఆదారి భాను(28) ఈ నెల 6వ తేదీ విధులకు వెళ్లి.. ఆ రోజు మధ్యాహ్నం నుంచి కనిపించలేదు. స్టీల్‌ప్లాంట్ పోలీసులకు అందిన ఫిర్యాదు మేరకు గాలింపు చర్యలు చేపట్టారు. డాగ్ స్క్వాడ్, కాల్ డేటా ఇలా అన్ని రకాలుగా ప్రయత్నించినప్పటికీ ఆచూకీ లభించలేదు. విభాగం సమీపంలోని డ్రెయిన్ నుంచి శనివారం దుర్వాసన రావడంతో అతని సహ కార్మికులు పోలీసులకు సమాచారం అందించారు. సీఐ వి.శ్రీనివాసరావు, ఎస్ఐ స్వామి నాయుడు పర్యవేక్షణలో డ్రెయిన్ నుంచి మృతదేహాన్ని బయటకు తీసి.. పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. మృతుడికి ఫిట్స్ ఉండటంతో దాని వల్ల డ్రెయిన్‌లో పడి మరణించి ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. ఆయనది ఎస్.కోట.

పోలీసు సిబ్బంది దర్బార్‌కు 15 వినతులు



సిబ్బంది సమస్యలు వింటున్న సీపీ రవిశంకర్

దొండపర్తి: నగర ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీస్ సిబ్బంది సమస్యలు, వినతుల పరిష్కారం కోసం నగర పోలీస్ కమిషనర్ ఎ.రవిశంకర్ శనివారం పోలీస్ కల్యాణ మండపంలో దర్బార్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 15 మంది సిబ్బంది వినతులు, సమస్యలను సీపీకి వివరించారు. ఇందులో శాఖాపరమైన వినతులే కాకుండా ఆర్మ్‌డ్ రిజర్వ్ ఆవరణలో పార్కింగ్ షెడ్ నిర్మాణం, క్యాంటీన్ ఏర్పాటు, వీక్లీ ఆఫ్, పరేడ్, రిమాండ్ ఖైదీలను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విచారణ, అవుట్ ప్రిజనర్ ఎస్కార్ట్స్‌లో ఉన్న సమస్యలు, నూతన హ్యాండ్ కఫ్స్, రేంజ్‌లో సీనియార్టీ లిస్ట్, టీఏ భత్యం పెంపు, పాత ఉమెన్ పోలీస్ స్టేషన్ వద్ద ఉన్న గోడను తొలగింపు వంటి విషయాలను సిబ్బంది సీపీ దృష్టికి తీసుకువచ్చారు. అలాగే సిబ్బందికి సంబంధించి ఉద్యోగ విరమణ సవరణ, తిరుపతి పీటీసీలో శిక్షణా కార్యక్రమం నుంచి వయసురీత్యా మినహాయింపు, జీటీ సిండ్రోమ్‌తో బాధపడుతున్న సిబ్బంది తనకు కఠినమైన విధుల నుంచి మినహాయింపు, 2007 బ్యాచ్ హెచ్‌సీ ప్రమోషన్, సీపీఎస్ మిస్సింగ్, ఇలా పలు శాఖాపరమైన వినతులు, సమస్యలను సీపీ రవిశంకర్‌కు విన్నవించారు. వీటిని పరిశీలించిన సీపీ అవసరమైన వాటిని తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు.

డీజీపీకి సీపీ లేఖ : సిబ్బంది వినతులు కొన్ని రాష్ట్ర స్థాయిలో తీసుకోవాల్సిన నిర్ణయాలు కావడంతో సీపీ రవిశంకర్.. డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డికి శనివారం లేఖ రాశారు. పోలీస్ అసోసియేషన్ ప్రతినిధులు ఇచ్చిన వినతిపత్రాన్ని ఆ లేఖతో జత చేశారు. వారి డిమాండ్లలో కొన్ని ప్రధాన అంశాలను డీజీపీ దృష్టికి తీసుకువెళ్లారు. ప్రధానంగా విశాఖకు వీవీఐపీ, వీఐపీలు తాకిడి ఎక్కువగా ఉండడంతో పాటు కీలక సమావేశాలు, పండుగల సమయాల్లో ఎస్కార్ట్స్, బందోబస్తు కల్పించాల్సి వస్తుండడంతో ఇక్కడి సిబ్బందికి వీక్లీ ఆఫ్‌లు అమలు చేయడం సాధ్యమవడం లేదని లేఖలో పేర్కొన్నారు. అలాగే 55 ఏళ్లు పైబడిన సిబ్బందిని బందోబస్తు విధుల నుంచి తొలగించాలని, ఇతర ప్రాంతాలకు బందోబస్తుకు వెళ్లే వారికి ముందస్తు టీఏ/డీఏలు ఇవ్వాలని ఆ లేఖలో పేర్కొన్నారు.

రేంజ్ పరిధిలో ఆరుగురు సీఐలకు స్థానచలనం

దొండపర్తి: విశాఖ రేంజ్ పరిధిలో ఆరుగురు ఇన్‌స్పెక్టర్లకు స్థానచలనం కలిగింది. ఈ మేరకు డీఐజీ హరికృష్ణ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో ఇద్దరిని విశాఖ రేంజ్ వీఆర్‌కు బదిలీ చేశారు.

ఇన్‌స్పెక్టర్	ప్రస్తుత స్థానం	బదిలీ అయిన స్థానం
సిహెచ్.ప్రసాద్	చినమేరంగి సర్కిల్, మన్యంజిల్లా	విశాఖ రేంజ్ వీఆర్
కె.మురళీధర్	పాలకొండ సర్కిల్	చినమేరంగి సర్కిల్
ఎం.చంద్రమౌళి	విశాఖ రేంజ్ వీఆర్	పాలకొండ సర్కిల్
ఎం.బుచ్చిరాజు	విజయనగరం సీసీఎస్	అచ్యుతాపురం
వై.మురళీరావు	అచ్యుతాపురం	విశాఖ రేంజ్ వీఆర్
ఎ.సత్యనారాయణ	విశాఖ రేంజ్ వీఆర్	విజయనగరం సీసీఎస్

ప్రభుత్వ భూమిలో ఆక్రమణల తొలగింపు



మధురవాడ రిక్షా కాలనీలో ఆక్రమిత భూమిలో పొక్లెయిన్‌తో షెడ్ తొలగిస్తున్న అధికారులు

మధురవాడ: మధురవాడలో సుమారు రూ.8 కోట్ల విలువ చేసే ప్రభుత్వ భూమి పరిరక్షణకు రెవెన్యూ అధికారులు చర్యలు చేపట్టారు. మధురవాడ రెవెన్యూ గ్రామం సర్వే నంబర్లు 6/1, 8/2, 9/2లోని 46 సెంట్ల ప్రభుత్వ భూమిలో శనివారం ఆక్రమణలు తొలగించారు. ఇందుకు సంబంధించి ట్రైనీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు కృష్ణమూర్తి, అనూష తెలిపిన వివరాలివీ.. సర్వే నంబర్లు 6/1లో 18 సెంట్లు, 8/2లో 22 సెంట్ల ప్రభుత్వ గయాలు భూమి, 9/2లో వాగుపోరంబోకు 6 సెంట్లు కలిపి మొత్తంగా 46 సెంట్ల ప్రభుత్వ భూమి ఉంది. ఈ భూమిని ఓ వ్యక్తి ఆక్రమించి ప్రహరీ నిర్మించాడు. వాచ్‌మన్‌తో పాటు సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాడు. పైగా ఈ భూమి తనదని చెప్పి కోర్టును కూడా ఆశ్రయించారు. దీంతో ఆ వ్యక్తికి ఉన్న హక్కులు నిర్ధారించి చర్యలు చేపట్టాలని రెవెన్యూ అధికారులకు కోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు అధికారులు 2022 ఆగస్టులో నోటీసులు జారీ, ప్రభుత్వ భూమికి మార్కింగ్ చేశారు. కానీ ఆ వ్యక్తి హక్కులు నిరూపించుకోలేకపోయారు. ప్రభుత్వ భూమి అని నిర్ధారణ కావడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శనివారం ఈ భూమిని స్వాధీనం చేసుకున్నట్లు డిప్యూటీ కలెక్టర్లు తెలిపారు. ఈ మేరకు ఆ స్థలంలో ఏర్పాటు చేసిన ఓ షెడ్, గడ్డి కుప్ప, ఫెన్సింగ్ తొలగించారు. ఇదే స్థలంలో ఓ కుటుంబం ప్రహరీ నిర్మించుకోగా.. దానికి తొలగించేందుకు అధికారులు ముందుకు సాగారు. అయితే అందులో సామాన్లు తరలించడానికి ఓ రోజు సమయం కావాలని ఆ కుటుంబ సభ్యులు కోరడంతో అధికారులు అవకాశం ఇచ్చారు. అనంతరం రిక్షాకాలనీ అనుకుని ఉన్న లే అవుట్‌లోని 3 సెంట్లను ఆక్రమించి వేసిన షెడ్ తొలగించారు. రిక్షా కాలనీ–రేవళ్లపాలెం శ్మశాన వాటిక మధ్య జీవీఎంసీ పార్కును కొందరు ఆక్రమిస్తున్నారని స్థానికులు ఫిర్యాదు చేయగా.. సర్వేయర్, వీఆర్వోలు పరిశీలించారు. ఆర్ఐ ప్రవీణ్ కుమార్, సర్వేయర్ సూర్య సత్య శ్రీనుబాబు పాల్గొన్నారు.

ముగిసిన నేవల్ ఆర్కిటెక్చర్ వర్క్‌షాప్

సింధియా : సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ ఇన్ మారిటైమ్ అండ్ షిప్ బిల్డింగ్ (సెమ్స్)లో పరిశ్రమల్లో ఉపయోగించే సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్, సాంకేతికతలకు సంబంధించిన 3 రోజుల శిక్షణ కార్యక్రమం శనివారంతో ముగిసింది. విశాఖ పోర్ట్ అథారిటీ, ఎల్ అండ్ టీ డిఫెన్స్, డబ్ల్యూవోటీ (వీ), డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ లైట్‌హౌస్‌లు, లైట్‌షిప్‌లు, సైఫ్ ఆటోమేషన్ సర్వీసెస్, ఏఎంఈటీ వర్సిటీ అధికారులు, ఇంజినీర్లు పాల్గొన్నారు.

వైభవంగా తిరుచ్చి ఉత్సవం

కొమ్మాది: రుషికొండలోని శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న పవిత్రోత్సవాల్లో భాగంగా మూడో రోజు శనివారం తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా ఉత్సవాలు కొనసాగాయి. ఉదయం 10.30 గంటల నుంచి 11.30 వరకు ఉత్సవ మూర్తులకు అత్యంత వైభవంగా స్నపన తిరుమంజనం నిర్వహించారు. మధ్యాహ్నం 12 గంటల నుండి ఒంటి గంట వరకు టీటీడీ వేద పండితులు, అర్చకుల ఆధ్వర్యంలో పవిత్ర సమర్పణ నిర్వహించారు. సాయంత్రం శ్రీవారి ఆలయ మాఢవీధుల్లో తిరుచ్చి ఉత్సవం ఘనంగా నిర్వహించారు. శ్రీవారి ఉత్సవ మూర్తులను మాఢ వీధుల్లో మంగళవాయిధ్యాలయ నడుమ వేలాది మంది భక్తుల సమక్షంలో ఊరేగించారు. ఆలయ ప్రాంగణంలో శ్రీవారి భక్తుల కోలాటం, అన్నమయ్య సంకీర్తనలు భక్తులను ఎంతగానో అలరించాయి. టీటీడీ ఆలయ ఏఈవో జగన్మోహనాచార్యులు భక్తులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా పర్యవేక్షించారు. ఆలయ సూపరింటెండెంట్, ఇన్‌స్పెక్టర్లు వెంకటరమణ, శివ, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.